# అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు

**● మూడో విడత 1,593 ఇండ్ల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్**



డబుల్ ఇండ్ల లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, అక్టోబర్ 5: నిరుపేదలకు సొంతింటి కలను నెరవేరుస్తామని ఇచ్చిన హామీకి సీఎం కేసీఆర్ కట్టుబడి ఉండి అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మూడో విడత డబుల్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ నియోజక వర్గంలోని మొత్తం 1,593 మంది లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించడం జరిగిందని అన్నారు. ఈ మేరకు గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో డబుల్ ఇండ్లు వచ్చిన లబ్ధిదారులందరినీ 62 ఆర్టీసీ బస్సుల్లో తీసుకెళ్లి వారికి కుటాయించిన ఇండ్లను తూంకుంట, మురారిపల్లిలో డబుల్ ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జయసింహలకు క్షీరాభిషేకం చేశారు. 400 డబుల్ ఇండ్లను మురహరిపల్లిలో పట్టాలను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. మిగతా వారికి తూంకుంటలో మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. డబుల్ ఇండ్ల విషయంలో ప్రతిపక్షాల విమర్శిలను తిప్పికొట్టేందుకు పారదర్శకంగా ఇండ్ల పంపిణీ జరుగుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్ని దశల వారీగా నెరవేరుస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికలలో ప్రజలందరూ సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించి మూడోసారి సీఎం చేయాలని అన్నారు. బీఆర్ఎస్‌ను ముషీరాబాద్‌లో భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ సర్కిల్-15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జయసింహ, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, నియోజక వర్గంలోని ఆరు డివిజన్‌ల అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, వై. శ్రీనివాస్ రావు, నర్సింగ్ ప్రసాద్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, ఆర్. మోజెస్, రాకేశ్ కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, రాజశేఖర్ గౌడ్, మధు, రమేశ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జయసింహ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

## బస్తీవాసుల సమస్యల పరిష్కారానికి చర్యలు



ధోబీఘాట్ బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి,అక్టోబర్ 5 : గాంధీనగర్ ధోబీఘాట్ బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారిస్తామని స్థానిక డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. గురువారం ధోబీఘాట్ బస్తీలో పావని పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీలు వాసులు తమ దృష్టికి తీసుకొొచ్చిన ససమ్యలు పరిష్కరిస్తాని చెప్పారు. వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, ఏఈ అబ్దుల్ సలామ్, బీజేవైఎం మాజీ నగర అధ్యక్షుడు వినయ్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ ప్రధాన మార్గంలో డ్రైనేజీ లీకేజీతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు నాలుగు నెలలు ప్రధాన రోడ్డు మధ్యలో డ్రైనేజీ లీకై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రాంనగర్ ఈసేవా వద్ద బస్సు స్టాఫ్ ఎదురుగా నిత్యం మురుగు నీరు లీకై రోడ్డంతా పరుచుకొని పారుతుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం కొత్తగా పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టడానికిగాను ఇటీవల ఎమ్మెల్యే ముఠా గోపాల్ నిధులు మంజూరు కూడా చేయించారు. అయినా జల మండలి అధికారులు పనులు చేపట్టకుండా కాలయాపన చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – ముషీరాబాద్, అక్టోబర్ 5

## ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 5 : ఉద్యోగుల నూతన పీఆర్‌సీ కోసం పే రివిజన్ కమీషన్ కమిటీని ఏర్పాటు చేసినందుకు గాను టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ గురువారం జిల్లా శాఖ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్య పథకం కార్డును అమలు చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న డీఏను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ డైరీ, స్పోర్ట్ మీట్‌పై ఈ సందర్భంగా చర్చించారు. శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. డాక్టర్ కల్పనా కాంటే బదిలీపై, తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డులో క్లిష్టమైన సమస్యలపై,పెన్షన్ చెల్లింపు కార్యాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా శాఖ కార్యదర్శి ఎస్ విక్రమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు పి వరదరాజు, ఉమర్‌ఖాన్, కురాడి శ్రీనివాస్, మహ్మద్ అబ్దుల్ ముజీబ్, ఈగ నరేశ్‌కుమార్, సభ్యులు సుజాత, ఖాలేద్ అహ్మద్ పాల్గొన్నారు.

# దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ఆకుల చంద్రశేఖర్, చిత్రంలో సీఐ నరసింహరాజు, డీఐ నర్సింహ, ఎస్ఐ గౌరేందర్‌గౌడ్ తదితరులు

అబిడ్స్, అక్టోబర్ 5 : దుకాణాల షెట్టర్లు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ముఠాను అబిడ్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగిలించిన హుక్కా ఫ్లేవర్స్ రూ. 2.30 లక్షల విలువ గల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఆకుల చంద్రశేఖర్, సీఐ నరసింహరాజు, డీఐ నర్సింహ, ఎస్ఐ గౌరేందర్‌గౌడ్‌లతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. చాదర్‌ఘాట్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్ (10), మహ్మద్ సోహెల్ (19), మహ్మద్ మసూద్ (27), మహ్మద్ అథర్ (32)లు కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హుక్కా సెంటర్ల షట్టర్లను పగులగొట్టి అందులో నుంచి హుక్కా ఫ్లేవర్స్‌ను దొంగిలించారు. రూ. 2.30 లక్షల విలువ చేసే వివిధ బ్రాండ్ల హుక్కా ఫ్లేవర్స్‌ను దొంగిలించిన ఈ ముఠా గురువారం ట్రూప్‌బజార్‌లోని అగర్వాల్ చాంబర్స్ వద్ద విక్రయించేందుకు ప్రయత్నిస్తుండా అబిడ్స్ సీఐ నరసింహారాజు, డీఐ నర్సింహా నేతృత్వంలో ఎస్ఐ గౌరేందర్‌గౌడ్ తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. నలుగురు నిందితులను విచారించగా రాత్రి పూట దుకాణాల షట్టర్స్ పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. ఈ ముఠా సభ్యులకు గతంలో కూడా పలు దొంగతనాలతో సంబంధం ఉందని, ముఖ్యంగా కాచిగూడ, చాదర్‌ఘాట్ ఇతర పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. నిందితుల నుంచి దొంగిలించిన సొత్తు రూ.2.30 లక్షల విలు చేసే హుక్కా ఫ్లేవర్స్‌తో పాటు ఒక ఆటో రిక్షా, రెండు బైక్‌లు, మూడు ఖరీదైన, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# హవాలా డబ్బు రూ. 35.50లక్షలు స్వాధీనం..ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీసు అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే తదితరులు

అబిడ్స్, అక్టోబర్ 5 : రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అక్రమ కార్యకలాపాలను తగ్గించేందుకు గాను నగరంలోని పలు ప్రాంతాల్లో నాఖాబంధీలను నిర్వహించనున్నట్లు నగర పోలీసు అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్ తెలిపారు. పురానాపూల్ ప్రాంతంలో నిర్వహించిన నాఖాబంధీలో అక్రమంగా నగదు రావాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 35.50 లక్షల హవాలా డబ్బును స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. గురువారం షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే గోషామహల్ ఏసీపీ వెంకట్ రెడ్డి, షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్‌లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను వెల్లడించారు. పురానాపూల్ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన నాఖాబంధీలో అత్తాపూర్‌కు చెందిన్ రోహిత్ గిరి(28)ని అదుపులోకి తీసకుని విచారించగా.. హవాలా రాకెట్ గుట్టు బయటపడిందన్నారు. రోహిత్ గిరి ఇచ్చిన సమాచారం మేరకు ముషీరాబాద్‌లో స్క్రాబ్ వ్యాపారం చేసే హమీదుల్లా (45)ను అరెస్టు చేసి వీరిద్దరి నుంచి రూ. 35.50లక్షల నగదును స్వాధీనం చేసుకోగా వీరి వెనుక హవాలా రాకెట్ నడుపుతున్న ముఠాలోని కీలక వ్యక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నట్లు వెల్లడించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో నాఖాబంధీ నిర్వహిస్తామని, అక్రంగా డబ్బు, మద్యం తరలింపు, ఇతర అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని నగర ప్రజలకు సూచించారు. గంజాయి, డ్రగ్స్ వల్ల సమాజంలో యువత భవిష్యత్ నాశనం అవుతుందని, ఇలాంటి అక్రమ వ్యాపారం గురించి తెలిస్తే వెంటనే పోలీసులు సమాచారం ఇవ్వాలని కోరారు. హవాలా, క్రికెట్ బెట్టింగ్, ఇతర వాటిపై గట్టి నిఘా పెట్టి ఉంచామని, హవాలా డబ్బు రాకెట్ వెనుక ఎంతటి పెద్దవారున్నా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసును షాహినాయత్‌గంజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.